క్లుప్తంగా

భూసార పరీక్షలు చేయించుకోండి



విస్సన్నపేట:రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు పంటల సాగుకు అవసరమైన భూసార పరీక్షలను చేస్తున్నట్లు సహాయ వ్యవసాయ సంచాకులు శశికళ తెలిపారు. తెల్లదేవరపల్లిలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మట్టినమూనాలు సేకరించిన అనంతరం రైతులకు పలు సూచనలిచ్చారు. భూసార పరీక్షల ఫలితాలు వచ్చిన తర్వాత పంటల సాగు చేపట్టాలని, పంట మార్పిడి పద్ధతి అనుసరించాలని సూచించారు. భూసార కార్డులో తెలియజేసిన విధంగా ఎరువులు వినియోగిస్తే నాణ్యమైన దిగుబడులు వస్తాయని తెలిపారు. మండలంలో ప్రతి రైతుసేవా కేంద్రం నుంచి 60 నమూనాల చొప్పున మొత్తం 620 నమూనాలను సేకరించి భూసార పరీక్ష చేస్తామన్నారు.

విత్తనాలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి



తిరువూరు:ఖరీఫ్ సీజన్లో రైతులకు అవసరమైన విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయాధికారి విజయకుమారి హెచ్చరించారు. తిరువూరు ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో డివిజన్ పరిధిలోని విత్తన డీలర్లకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాణ్యమైన విత్తనాలను అమ్మాలని, రైతుకు రశీదు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. డీలర్లు స్టాక్ రిజిస్టరు కచ్చితంగా నిర్వహించాలని ఆదేశించారు. అధికధరకు విత్తనాలను విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దుకాణాల వద్ద విత్తన ధరల పట్టిక ప్రదర్శించాలని, రైతుల్ని ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవన్నారు. ఏడీఏ కెనడీ, వ్యవసాయాధికారులు పద్మ, టిప్పుసుల్తాన్, సాయిశ్రీ, విత్తన డీలర్లు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి ఆలయంలో తిరువంజన



తిరువూరు:జగన్నాథపురం కాలనీలో వేంచేసిన దాసాంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం తిరువంజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయం పునర్నిర్మించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌లకు తిరువంజన చేశారు. ఆలయ సంప్రోక్షణ, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం జరిపారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెల్లంకి సురేంద్రబాబు పర్యవేక్షించారు.

ధాన్యం ఆరబెట్టి తేవాలి



మైలవరం: ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని తహసీల్దారు సుశీలాదేవి తెలిపారు. రెడ్డిగూడెం మండలం కుదప గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రంను తహసీల్దారు శుక్రవారం ప్రారంభించారు. 17 శాతం లోపు తేమ ఉన్న వడ్లను లారీలకు లోడు చేసి మిల్లులకు పంపించాలని టెక్నికల్ స్టాఫ్‌కు సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన రైతులుతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సురేష్‌కుమార్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, నాయకులు నాగేశ్వరరెడ్డి, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి, పీఏసీఎస్ కార్యదర్శి మార్కండేయ, వీఆర్వోలు జానీ సాహెబ్,వీఏఏ రాజు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

30న ఆలయ భూములకు బహిరంగ వేలం

ఇబ్రహీంపట్నం:పెనమలూరు మండలం చోడవరం గ్రామంలోని శ్రీచెన్నకేశవ స్వామి వారి ఆలయ భూములకు ఈ నెల 30న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి యువీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం జమీనవేపోతవరం (కేతనకొండ) రెవెన్యూ పరిధిలో స్వామి వారికి చెందిన 4.02 ఎకరాల భూమికి మూడేళ్ల కాలానికి కౌలు బహిరంగ వేలం కేతనకొండ పంచాయతీ కార్యాలయం వద్ద జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు ఆరోజు ఉదయం 10 గంటలకు హాజరుకావాలని పేర్కొన్నారు. వివరాలకు 98853 59797 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సెలవులొచ్చాయ్.. జరభద్రం

- ప్రమాదాల బారిన పడుతున్న పిల్లలు
- పిల్లలపై తల్లిదండ్రుల నిరంతర పర్యవేక్షణ తప్పనిసరి
- సమ్మర్ క్యాంపులకు పంపితే మేలంటున్న ఉపాధ్యాయులు
- నియోజకవర్గంలో 70 వేల మందికి పైగా పాఠశాల విద్యార్థులు



ఇబ్రహీంపట్నం మండల పరిధి కీలేశపురం గ్రామ శివారులో బూడిద చెరువు నుంచి వచ్చే నీటిలో ఈత కొడుతున్న పిల్లలు

జి.కొండూరు:స్కూల్, ట్యూషన్లు, బండెడు పుస్తకాలతో హోమ్ వర్కుల భారం, పరీక్షలు, మార్కులు ఇలా ఏడాదంతా కొంచెం ఇష్టం, కొంచెం కష్టంగా పాఠశాలలకు పరుగులు పెడుతున్న విద్యార్థులకు సమ్మర్ సెలవులతో బిగ్ రిలీఫ్ వచ్చింది. ఈ నెల 24 నుంచి ప్రభుత్వం పాఠశాలలకు సమ్మర్ సెలవులు ప్రకటించడంతో సెలవు దినాలను ఎంజాయ్ చేయాలనే భావనతో పిల్లలు ఉవ్విళ్లూరుతున్నారు. అయితే ఈ ఎంజాయ్‌మెంట్ వెనుక విషాదం కూడా ఉంటుంది. సెలవురోజుల్లో చిన్నారులు ప్రమాదాల బారిన పడి తీవ్రంగా గాయపడి క్షతగాత్రులుగా మారడం, మృత్యువాత పడడం వంటి ఘటనలు జరుగుతూ ఉంటాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచాలని పోలీసులు కోరుతున్నారు.

మైలవరం నియోజకవర్గంలో...

నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు వెళ్లే పిల్లలు 73,852 మంది వరకు ఉన్నారు. నియోజకవర్గంలో పెద్దగా సమ్మర్ క్యాంపులు కూడా లేకపోవడంతో పిల్లలు ఎక్కువగా చెరువులు, బావులు, పోలవరం కాల్వ, వీటీపీఎస్ కూలింగ్ కెనాల్, కృష్ణానది, కీలేశపురం బూడిచెరువు వాటర్ పాల్ వంటి ప్రదేశాలలో ఈతకు వెళ్తూ ఉంటారు.

ప్రమాదాలు ఇలా...

- జి.కొండూరు మండల పరిధి కవులూరు జెడ్పీ హైస్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బలుసుపాటి కుమార్ (14) మార్చి 21వ తేదీన ఒంటిపూట బడి పూర్తయిన తర్వాత స్నేహితులతో కలిసి ఇదే గ్రామ శివారులోని బుడమేరు డైవర్షన్ కెనాల్ నుంచి లీకవుతున్న నీటి వద్దకు సరదాగా వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడిపోవడంతో మృత్యువాత పడ్డాడు.
- జి.కొండూరు మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు గ్రామానికి చెందిన పునుగుమాటి నాగచైతన్య (15), అదే గ్రామానికి చెందిన సరిపల్లి విష్ణు ఫిబ్రవరి 27న పాఠశాలకు సెలవుదినం కావడంతో బైకుపై వెళ్తూ ప్రమాదానికి గురై నాగచైతన్య మృతి చెందగా విష్ణుకి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు నాగచైతన్య వెలగలేరు జెడ్పి హైస్కూల్లో పదో తరగతి చదువుతుండగా విష్ణు అదే పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు.

ఈ అంశాలపై పర్యవేక్షణ అవసరం.....

- గ్రామాలలో పిల్లలు బావుల్లో, చెరువుల్లో, కాల్వల్లో ఈతకు వెళ్లే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈత రాకుండా బావుల్లోకి, చెరువుల్లోకి దిగడం వల్లన ప్రమాదానికి గురవుతారు.
- పిల్లలు సెలవు రోజుల్లో వాహనాలను నడిపేందుకు ఆసక్తి చూపుతుంటారు. వాహనాలను నేర్చుకునే సమయంలో ప్రమదాల భారిన పడుతుంటారు. అంతే కాకుండా పక్కన వెళ్లే వారితో పోటీగా బండి నడపాలని దూసుకుపోతుంటారు. ఇటువంటి సమయాలలో ప్రమదాల భారిన పడుతుంటారు.
- ఎండలు తీవ్రత కూడా ఎక్కువగా ఉన్నందున పిల్లలు ఎండలో ఎక్కువగా తిరగడం, ఆడడం వల్లన వడ దెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది.
- ప్రస్తుత కాలంలో సెలవురోజుల్లో పిల్లలు ఫోన్, టీవీకి అడిక్ట్ అవుతున్నారు. దీని వల్లన కంటి సమస్యలతో పాటు మానసిక సమస్యలు వచ్చే అవకాశం ఉంది.
- చిన్న పిల్లలకు అగ్నిప్రమాద కారకాలైన అగ్గిపెట్టెలు, లైటర్లు వంటి వస్తువులను అందకుండా చూసుకోవాలి. లేదంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
- ఇంటిని శుభ్రపరిచే మందులు, వ్యవసాయానికి వినియోగించే రసాయనిక మందులు వంటి విషపూరిత పదార్థాలను పిల్లలకు అందకుండా చూసుకోవాలి.
- సెలవుల్లో పిల్లలు చదువు మానేసి ఇంటి వద్ద పనులు చేసుకునే వారితో కలిసి మత్తు పదార్థాలకు అలవాటు పడడం, బెట్టింగులకు పాల్పడడం, ఈజీ మనీ కోసం చోరీలకు అలవాటు పడే అవకాశం కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక ప్రతి క్షణం పర్యవేక్షిస్తూ ఉండాలి
- పిల్లలు భవనాలు, గోడలపై ఎక్కినప్పుడు జారి పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.
- సెలవు రోజుల్లో పిల్లలపై తల్లిదండ్రులు నిరంతర నిఘా ఉంచితే ప్రమాదాల భారి నుంచి తప్పించే అవకాశం ఉంటుంది.

నిరంతర పర్యవేక్షణ ఉండాలి



సెలవు రోజుల్లో పిల్లలపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలి. సరదా కోసం బైక్‌లు ఇవ్వడం వల్లన ప్రమదాలు జరిగే అవకాశం ఉంది. తెలిసీతెలియని వయస్సులో మత్తు పదార్థాలకు అలవాటు పడే అవకాశం ఉంది. చెరువులు, కాల్వలు, వాగుల్లో ఈతలకు వెళ్లకుండా చూసుకోవాలి. క్రీడలు, కల్చరల్ ప్రోగ్రాంలలో పాల్గొనేలా శిక్షణ ఇచ్చేందుకు సమ్మర్ క్యాంపులలో చేరిప్పించడం వల్లన ఇటువంటి ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చు.

– కె.సతీష్‌కుమార్, ఎస్ఐ, జి.కొండూరు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



చాట్రాయి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గీత తెలిపారు. శుక్రవారం మండలంలోని చాట్రాయి, బూరుగుగూడెం, కోటపాడు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవాలని ఆమె చెప్పారు. మండలంలో 550 ఎకరాల్లో రబి వరి సాగు చేయగా 200 ఎకరాల్లో కోతలు పూర్తి అయ్యాయని వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. ఇప్పటి వరకు 66 మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేసామని ఆయన చెప్పారు.

ఉద్యాన పంటలు సాగు పెంచాలి

ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీ అరవపల్లి రాము

జి.కొండూరు:జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటల సాగును పెంచేలా రైతులకు అవగాహన కల్పించాలని ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీ అరవపల్లి రాము అన్నారు. జి.కొండూరు కమ్యూనిటీ హాలులో విజయవాడ క్లస్టర్ పరిధిలోని ఉపాధి హామీ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మైలవరం, జి.కొండూరు, విజయవాడరూరల్, ఇబ్రహీంపట్నం మండలాల ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు. డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ఉద్యాన పంటలను సాగు చేస్తే అందే ఆర్థిక సాయంపై రైతులకు వివరించాలన్నారు. అదేవిధంగా ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనపై కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం బెస్ట్ ఫీల్డ్ అసిస్టెంట్ అవార్డును అందుకున్న కందులపాడు ఫీల్డ్ అసిస్టెంటు కంచర్ల పద్మని సన్మానించారు.

పరిసరాల శుభ్రతతో మలేరియా నివారణ



మూలపాడులో మురుగునీటిలో దోమల లార్వాను పరిశీలిస్తున్న డాక్టర్ పర్వీన్



తెల్లదేవరపల్లిలో మలేరియాపై అవగాహన ప్రదర్శన

ఇబ్రహీంపట్నం:పరిసరాల శుభ్రతతో మలేరియా వ్యాధి నివారించవచ్చని ఇబ్రహీంపట్నం పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వీన్ తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మూలపాడు, గుంటుపల్లి గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రైనేజీల్లో మురుగు నీటి వ్యర్థాలు తొలగించారు. నీటిలో దోమల లార్వాను పరిశీలించారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. డాక్టర్ పర్వీన్ మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని తగిన జాగ్రత్తలు పాటిస్తే మలేరియాను సమూలంగా అంతం చేయవచ్చని వెల్లడించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు చింతల భూలక్ష్మీ, భుక్యా కవిత, కార్యదర్శులు పి.అనీల్ కుమార్, జి.మునేశ్వరరావు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట:నివాసగృహాల నుంచి వచ్చే నీటిని రోడ్లపైకి వదలవద్దని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో చిన రాట్నాలు కోరారు. శుబీజెఆర్ నగర్లో డ్రై డే సందర్భంగా స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో జ్వరాలు వ్యాపించే అవకాశం ఉన్నందున దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. తహసీల్దారు లక్ష్మీ కల్యాణి, మండల వైద్యాధికారి శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ఇన్‌చార్జి గోపాలకృష్ణ, ఎంపీటీసీ మల్లయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుజాత పాల్గొన్నారు.

మైలవరం:దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ నాగేశ్వరరావు సూచించారు. రెడ్డిగూడెంలో ప్రపంచ మలేరియా దినోత్సవం, డ్రై డే ఫ్రైడే కార్యక్రమం ఎంపీడీఓ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మలేరియా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి దోమల ద్వారా వచ్చే వ్యాధులు, పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. రెడ్డిగూడెం సర్పంచ్ మల్లాది రాణి, టీడీపీ మండల అధ్యక్షుడు ఎం. నాగేశ్వరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామారావు, పీహెచ్‌సీ హెల్త్ ఆఫీసర్ వి. శ్యాంసుందర రావు, సూపర్‌వైజర్ రాంకుమార్, భవాని, హెల్త్ అసిస్టెంట్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేట:మండలంలోని తెల్లదేవరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహించారు. మలేరియా నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యాధికారులు వివరించారు. పరిసరాల శుభ్రతతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని, మలేరియా లక్షణాలు కనిపిస్తే వైద్యశాలలో పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం అవగాహన ప్రదర్శన జరిపారు.

నూజివీడు: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, మురుగనీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా దోమల బెడద ఉండదని, తద్వారా మలేరియాను అదుపులో ఉంచవచ్చని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.యలమంద అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కోనేరుపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏరియాలో శుక్రవారం మలేరియాపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.

చాట్రాయి: మలేరియాని నిర్మూలనకు ప్రజలు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యుడు శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చాట్రాయి గ్రామంలో నిర్వహించిన ప్రపంచ మలేరియా దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.సీహెచ్‌ఓ రమణ పీహెచ్‌సీ బృంది పాల్గొన్నారు.

ముసునూరు: మలేరియా వ్యాధిని అంతమొందించాలంటే దోమల నిర్మూలనకు కృషి చేయాలని వైద్యాధికారులు షకీనా ఇవాంజిలిన్, కరీముల్లా పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా శుక్రవారం ముసునూరు, రమణక్కపేట పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీలను నిర్వహించారు. అనంతరం వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆగిరిపల్లి: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని నూజివీడు మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ యలమంద సూచించారు. శనివారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి, ఈదర పీహెచ్‌సీల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈదర పీహెచ్‌సీ వైద్యులు నాగజ్యోత్స్న, ఎంపీహెచ్ఇఓ రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద దాడులకు ముస్లింల నిరసన



కొండపల్లిలో ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ ర్యాలీ నిర్వహించిన ముస్లింలు



తిరువూరు జామియా మసీదు ఎదుట ముస్లింల ప్రదర్శన



శాంతిర్యాలీ నిర్వహిస్తున్న ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, కార్మికులు

తిరువూరు:కాశ్మీర్లోని పహల్గావ్‌లో పర్యాటకుల్ని ఉగ్రవాదులు కాల్చిచంపిన సంఘటన నిరసిస్తూ తిరువూరు జామియా మసీదు ఎదుట ముస్లింలు శుక్రవారం జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం ప్రార్థనల అనంతరం జామియా మసీదు ఇమాం మౌల్వీ రజ్వీ ఆధ్వర్యంలో ముస్లింలు ఉగ్రవాదం నశించాలని నినాదాలు చేస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):కాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ముస్లింలు ముక్తకంఠంతో ఖండించారు. కొండపల్లి జామియా మసీదు వద్ద మృతి చెందిన వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. పట్టణంలో నిరసన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ఉగ్రవాదులు ఏ మతంలో ఉన్నా దేశానికి ప్రమాదకరం అన్నారు. హనీమూన్‌కు వెళ్లిన కొత్త జంట కాళ్ల పారాణి ఆరకముందే వారి జీవితాలను ముష్కరులు చిదిమేశారని మండిపడ్డారు. కళ్లముందే కట్టుకున్న భర్తను కాల్చిచంపడంతో నవవధువు ఆక్రోదన వర్ణణాతీతం అన్నారు. ఇటువంటి మదోన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉగ్రదాడికి నిరసనగా శాంతి ర్యాలీ

ఇబ్రహీంపట్నం:జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రదాడికి నిరసనగా ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. సంస్థ ప్రధాన గేటు నుంచి బయలు దేరిన ర్యాలీ రింగ్ సెంటర్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు, ఏపీ జెన్‌కో శిక్షణా కేంద్రం చీఫ్ ఇంజనీర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి యావత్ భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. దాడిలో మరణించిన వారి పవిత్ర ఆత్మలకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. పలువురు ఎస్ఈలు, ఈఈలు, డీఈలు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలి

డీపీఓ లావణ్య కుమారి



పుల్లూరులో డ్రెయినేజీని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిస్తున్న డీపీఓ లావణ్యకుమారి

మైలవరం: ఆరోగ్యవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలో ప్రపంచ మలేరియా డే పురస్కరించుకుని ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో డీపీఓ లావణ్యకుమారి శుక్రవారం పాల్గొన్నారు. గ్రామాల్లోని వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా డ్రెయినేజీలను బాగు చేసుకుని వర్షాకాలంలో నీటి పారుదలకు అనుకూలంగా ఉండేలా చూడాలన్నారు. ఇళ్ల చుట్టూ మురుగు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తొట్టెలు, ట్యాంకులలో నిలువ నీరు లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమల లార్వాలు పెరిగి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని పేర్కొన్నారు. నీరు నిలువ లేకుండా చూసుకోవాలని తెలిపారు. ఇళ్ల ప్రాంగణాల్లో తొట్టెలు, డ్రెయినేజీలు పరిశీలించి పంచాయతీ సిబ్బందికి, ఇంటి యజమానులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనూరాధ, పంచాయతీ సిబ్బంది. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు తాగునీటి తొట్టెలు ఏర్పాటు



మైలవరం:ఎండల తీవ్రతకు మూగజీవాలు తాగునీటికి అల్లాడుతున్నాయని, ఈ నేపథ్యంలో మండలంలోని పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. పశువులు ఎక్కువగా ఉండి నీటి కొరత ఉన్న గ్రామాల్లో ఈ నీటి తొట్టెలు ఏర్పాటు చేశామని చెప్పారు. మండలంలోని పూరగుట్ల, పొందుగల, పుల్లూరు తదితర గ్రామాల్లో తొట్టెల ఏర్పాటు చేసి పశువులకు తాగునీటి వసతి కల్పించామని పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చెరువు గండ్లు పూడ్చాలని వినతి



డీఆర్వోకి వినతి పత్రం అందిస్తున్న పైడూరుపాడు రైతులు

పైడూరుపాడు(విజయవాడరూరల్):పైడూరుపాడు గ్రామంలో చెరువుకు, వీటీపీఎస్ నుంచి వచ్చే కాల్వకు పడిన గండ్లను పూడ్చాలని కోరుతూ శుక్రవారం పైడూరుపాడు గ్రామ రైతులు జిల్లా రెవెన్యూ అధికారి ఎం.లక్ష్మి నరసింహంని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందించారు. సెప్టెంబరు నెలలో వచ్చిన బుడమేరు వరదలకు వీటీపీఎస్ కాల్వకు, చెరువుకు అనేక చోట్ల గండ్లు పడి గ్రామంలోని రైతులు దాళ్వాలో వరి పండించుకునేందుకు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ఆ పరిస్థితిలో రైతులు సొంతంగా ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున ఖర్చు చేసి తాత్కాలికంగా మరమ్మతులు చేయించుకున్నారని పేర్కొన్నారు. వచ్చే సార్వా సీజన్లో రైతులు పంటలు పండించుకునేందుకు వీలుగా కాల్వకు, చెరువుకు పడిన గండ్లకు మరమ్మతులు చేయాలని విజ్ఞప్తి చేశారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు అవసరమైన సంచులు, లారీలను కూడా పంపాలని కోరారు. డీఆర్వోని కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ వేముల సీతారామయ్య, రంగినేని నాగేశ్వరరావు, జె.వెంకటేశ్వరరావు, పెయ్యల కోటేశ్వరరావు, కేవీ సుబ్బారావు, నరసింహరావు, డి.వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

హనిమిరెడ్డి స్ఫూర్తితో ఉన్నత శిఖరాలు



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి, పాల్గొన్న అధ్యాపకులు

మైలవరం:ప్రవాసాంధ్రులు, విద్యా ప్రదాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలని తెలుగు విభాగం శాఖాధ్యక్షులు డాక్టర్ మెండా దేవానందకుమార్ తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల తెలుగు విభాగం శాఖాధ్యక్షులు డాక్టర్ మెండా దేవానందకుమార్ గతంలో రచించిన వెల్వడం నుంచి అమెరికా వరకు అనే జీవిత చరిత్ర గ్రంథాన్ని పునర్ముద్రణ చేశారు. ఈ గ్రంథాన్ని డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి శనివారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. రచయిత డాక్టర్ మెండా దేవానందకుమార్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ డాక్టర్ హనిమిరెడ్డి జీవితంలో నుంచి ఎంతో నేర్చుకోవాల్సి ఉందని చెప్పారు. కేవలం డబ్బు సంపాదించడమే పరమావధి కాకూడదని తెలిపారు. సంపాదించిన దానిలో దానం చేయడం కూడా అలవాటు చేసుకోవాలని సూచించారు. డాక్టర్ హనిమిరెడ్డి జీవిత చరిత్ర మనకు స్ఫూర్తినిస్తుందన్నారు. పట్టణ ప్రముఖులు పలువురు పాల్గొని రచయితను అభినందించారు. గత సంవత్సరం ముద్రించిన 500 కాపీలకు మంచి స్పందన వచ్చిందని ఆ స్ఫూర్తితోనే ఇప్పుడు మరో 500 కాపీలను ముద్రించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

కూలి డబ్బులు చెల్లించాలి

నూజివీడు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు గత మూడు నెలలుగా ప్రభుత్వం కూలి డబ్బులు చెల్లించకపోవడం దారుణమని సీపీఐ నాయకులు నిమ్మగడ్డ నరసింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని దిగవల్లిలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల వద్దకు శుక్రవారం వెళ్లి వారితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గత మూడు నెలలుగా పనిచేసిన పనులకు కూలి డబ్బులు ఇవ్వలేదని కూలీలు నరసింహం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని చేసిన కాలానికి కూలి డబ్బులు మూడు నెలలుగా రాక పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సురేష్, రామారావు, వనజ పాల్గొన్నారు.

సుంకొల్లులో సారా స్వాధీనం

నూజివీడు: స్థానిక ఎక్సైజ్ సిబ్బంది మండలంలోని సుంకొల్లులో శుక్రవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన కొనకాల వెంకటరమణ వద్ద ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. అలాగే వెంకటరమణకు సారాను సరఫరా చేస్తున్న అదే గ్రామానికి చెందిన పామర్తి రమాదేవిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పథకం పక్కదారి పట్టింది



తిరువూరు:పేదవర్గాల కోసం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం పూర్తిగా పక్కదారి పట్టిందని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. గంపలగూడెం మండల కమిటీ సమావేశం శుక్రవారం ఊటుకూరులో జరిగింది. సమావేశంలో పాల్గొన్న శంకర్ మాట్లాడుతూ తిరువూరు నియోజకవర్గం మీదుగా తెలంగాణకు 26 మార్గాల్లో ఇసుక తరలిపోతుంటే అధికారులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ఆరోపించారు. వినగడప వద్ద కట్టిలేరుపై వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలని, కిడ్నీ బాధితులు పెరుగుతున్నందున నియోజకవర్గానికి కృష్ణా జలాలను సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పేరంటాళ్ళ గుట్ట నుంచి అక్రమ మైనింగ్ కార్యకలాపాలను అడ్డుకోవాలని, గంపలగూడెం నుంచి నెమలి వరకు వాహనాల రద్దీ అధికంగా ఉన్నందున పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం రహదారి వెడల్పు చేయాలని తెలిపారు. పార్టీ నాయకులు తూము కృష్ణయ్య, చిలుకూరి వెంకటేశ్వరరావు, నాగుల్‌మీరా, కొండలరావు, కృష్ణ, జాన్, వైకుంఠరావు పాల్గొన్నారు.